RNI NO:APTEL /2023/90201

# రాజధాని వాయిస్

తెలుగు దినపత్రిక

web : www.rajadhanivoice.in    rajadhanivoicedaily@gmail.com

విలేఖరులు కావలెను
రాజధాని వాయిస్ తెలుగు దినపత్రికలో కొనసాగుటకు
గుంటూరు,పల్నాడు,జిల్లాలలో స్టాఫర్లు
నియోజకవర్గాలకు ఇంచార్జులు మరియు
మండలాల వారిగా విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించగలరు.
9030343195
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును

సంపుటి : 02 | సంచిక : 287 | 8 మంగళవారం సెప్టెంబరు 2026 | ఎడిటర్ : పాగళ్ల పూర్ణచంద్రరావు | పేజీలు : 4 | వెల : రూ.1/-

## అమరావతే రాజధాని

- కొత్త పార్టీపై అధికారిక ప్రకటన - యువతకు 66 శాతం ప్రాధాన్యం
- తాను సీఎం అభ్యర్థిని కాదన్న విజయసాయి - అప్పుల భారం తగ్గించడమే లక్ష్యం



**రాజధాని వాయిస్ అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లో కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించిన మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. అమరావతిని రాష్ట్ర రాజధానిగా అంగీకరించడంలో తనకు ఎలాంటి అభ్యంతరం లేదని, ఇష్టమున్నా లేకున్నా అమరావతినే రాజధాని గా ఒప్పుకోవాల్సిన పరిస్థితి ఉందని పేర్కొన్నారు. భవిష్యత్ రాజకీయ కార్యాచరణపై మీడియాతో మాట్లాడిన ఆయన పలు ఆసక్తికర అంశాలను వెల్లడించారు. రాష్ట్ర అభివృద్ధి, పరిశ్రమల స్థాపన, ఉపాధి అవకాశాల కల్పనే తమ కొత్త పార్టీ ప్రధాన లక్ష్యమని విజయసాయిరెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలను అధిగమించి రాష్ట్రాన్ని అప్పుల భారం నుంచి బయటపడేయాలనే ఉద్దేశంతోనే కొత్త రాజకీయ వేదికను తీసుకువస్తున్నట్లు చెప్పారు. అభివృద్ధి, పారదర్శకత, సమాన అవకాశాలే తమ పార్టీ సిద్ధాంతాలని వివరించారు.రాష్ట్ర రాజకీయాల్లో కొన్ని సామాజిక వర్గాలకే అధిక ప్రాధాన్యం లభిస్తోందని వ్యాఖ్యానించిన ఆయన, అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించే రాజకీయ వ్యవస్థ అవసరమని అన్నారు. ముఖ్యంగా వెనుకబడిన వర్గాలు, యువత, మహిళలకు తగిన ప్రాతినిధ్యం కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. తమ పార్టీలో 66 శాతం అవకాశాలు యువతకే ఇస్తామని ప్రకటించారు. తాను ముఖ్యమంత్రి అభ్యర్థిని కాదని విజయసాయిరెడ్డి స్పష్టం చేశారు. - మిగతా 2లో..

## కూటమి ఐక్యతకు భంగం కలిగించే పోస్టులు పెట్టొద్దు

- టీడీపీ, జనసేన కార్యకర్తలకు విజ్ఞప్తి
- సోషల్ మీడియాలో పరస్పర విమర్శలు నిలిపివేయాలని పిలుపు
- స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా ఐక్యంగా పనిచేయాలని సూచన
- టీడీపీ సోషల్ మీడియా విభాగం

**అమరావతి, సెప్టెంబర్ 07 రాజధాని వాయిస్** తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ కార్యకర్తలు సోషల్ మీడియా వేదికగా పరస్పరం విమర్శలు, దూషణలకు దిగకుండా కూటమి స్ఫూర్తిని కాపాడాలని టీడీపీ సోషల్ మీడియా విభాగం విజ్ఞప్తి చేసింది. కొందరు వ్యక్తిగత కోపాలు, ఆవేశాలతో పార్టీ ఆదేశాలను పట్టించుకోకుండా సోషల్ మీడియా లో పోస్టులు పెడుతున్నారని, ఇది కూటమి ఐక్యతకు భంగం కలిగించే పరిస్థితులను సృష్టిస్తోందని పేర్కొంది. ముఖ్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, వారి కుటుంబ సభ్యులు, అలాగే టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైన పద్ధతి కాదని స్పష్టం చేసింది. ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి కార్యక్రమాలు, పరిపాలనకు సంబంధించిన అంశాలపై అవగాహన లేకుండా ప్రతికూల ప్రచారం చేయడం వల్ల ప్రజల్లో తప్పుడు సంకేతాలు వెళ్లే ప్రమాదం ఉందని పేర్కొంది. అలాగే డీఎస్సీ అంశంపై వైసీపీ చేస్తున్న ఫేక్ ప్రచారాన్ని ఎదుర్కొనే సమయంలో కూటమి భాగస్వామ్య పార్టీల కార్యకర్తలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం వల్ల రాజకీయ ప్రత్యర్థులకు అవకాశాలు లభిస్తాయని హెచ్చరించింది. ప్రభుత్వం ప్రతిష్ఠ దెబ్బతినేలా వ్యవహరించవద్దని కోరింది.ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కార్యకర్తలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని గుర్తు చేసింది. ఈ సమయంలో పరస్పర ఘర్షణలు, ఆరోపణలు, విమర్శల కంటే ఉమ్మడి రాజకీయ ప్రత్యర్థి అయిన వైఎస్సార్‌సీపీ విధానాలను ప్రజల్లో ఎండగట్టడంపైనే దృష్టి పెట్టాలని సూచించింది. కూటమి ఐక్యతను బలోపేతం చేయడం ద్వారా మాత్రమే ఎన్నికల్లో విజయాన్ని సాధించవచ్చని పేర్కొంది. ఇటీవల సోషల్ మీడియాలో ఎన్టీఆర్‌పై కొందరు జనసేన కార్యకర్తలు, చిరంజీవిపై కొందరు టీడీపీ కార్యకర్తలు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైన పద్ధతి కాదని అభిప్రాయపడింది. అలాగే ఇరు పార్టీల నాయకులు ప్రాతినిధ్యం వహిస్తున్న శాఖలపై పూర్తి సమాచారం లేకుండా విమర్శలు చేయడం, బురదజల్లే ప్రయత్నాలు చేయడం కూడా మానుకోవాలని కోరింది. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించింది.ఏవైనా అభ్యంతరాలు లేదా సమస్యలు ఉంటే సోషల్ మీడియా ద్వారా - మిగతా 2లో..

## 913 ఆశా పోస్టుల భర్తీకి ఆమోదం

### మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి.. కూటమి ప్రభుత్వంలో ఇప్పటికే 1,294 పోస్టుల భర్తీ



**అమరావతి, సెప్టెంబర్ 07 రాజధాని వాయిస్ ::** ప్రజలకు వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకు కీలకంగా పనిచేస్తున్న ఆశా (సామాజిక ఆరోగ్య కార్యకర్తలు) కార్యకర్తల ఖాళీల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 913 ఆశా పోస్టుల భర్తీకి ఆమోదం తెలిపినట్లు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. తాజా నియామకాలతో రాష్ట్రంలో ఆశా పోస్టులన్నీ భర్తీ కానున్నాయని తెలిపారు. జీరో వెకెన్సీ విధానంలో నియామకాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గడిచిన రెండేళ్లలో ఇప్పటికే 1,294 ఆశా పోస్టులను భర్తీ చేసినట్లు మంత్రి తెలిపారు. తాజాగా ఆమోదించిన 913 పోస్టులతో కలిపి మొత్తం 2,207 పోస్టులు భర్తీ చేసినట్లవుతుందన్నారు. తాజా ఖాళీల్లో 673 గ్రామీణ, 64 గిరిజన, 176 పట్టణ పోస్టులు ఉన్నాయని వెల్లడించారు.

**జిల్లా ఆరోగ్య సంఘాల ద్వారా నియామకాలు** కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఆశా కార్యకర్తల నియామక ప్రక్రియ కొనసాగనుంది. జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా ఉన్న డిస్ట్రిక్ట్ హెల్త్ సొసైటీల ద్వారా నియామకాలు చేపట్టనున్నారు. - మిగతా 2లో..

## తెలుగు జాతి ఆస్తి చంద్రబాబు: పయ్యావుల

- లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ప్రత్యేక ప్రసంగం - స్వర్ణాంధ్ర విజన్-2047పై ప్రజెంటేషన్
- విజన్-2020 దేశానికి మార్గదర్శి - అభివృద్ధికి చంద్రబాబు నాయకత్వమే కారణం



**మంగళగిరి రాజధాని వాయిస్ : :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలుగుదేశం పార్టీకి మాత్రమే పరిమిత మైన నాయకుడు కాదని, యావత్ తెలుగు జాతికి చెందిన ఆస్తి అని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఈరోజు ఆలోచించే అంశాలను రేపు దేశం అనుసరిస్తుందని వ్యాఖ్యానించారు. రాష్ట్ర అభివృద్ధి దిశగా చంద్రబాబు చూపిన దూరదృష్టి - మిగతా 2లో..



## ప్రతి ఎకరాకు నీరు

- 'వాటర్ మ్యాన్'గా గుర్తింపు రావడం ఆనందంగా ఉందన్న సీఎం
- పోలవరం సహా 36 సాగునీటి ప్రాజెక్టుల పూర్తి లక్ష్యం
- కూటమి ఐక్యత, కార్యకర్తల పాత్రపై పార్టీ నేతలకు దిశానిర్దేశం

**అమరావతి రాజధాని వాయిస్ :** రాష్ట్రంలోని పోలవరం సహా అన్ని సాగునీటి ప్రాజెక్టులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరు అందించడమే తన లక్ష్యమని ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అమరావతిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన రెండు రోజుల 'లీడర్‌షిప్ కాన్‌క్లేవ్'లో పార్టీ నాయకులను ఉద్దేశించి ప్రసంగించిన ఆయన, సాగునీటి రంగంలో తాను చేస్తున్న కృషిని గుర్తిస్తూ ప్రముఖ 'ఎకనామిక్ టైమ్స్' పత్రిక తనను 'వాటర్ మ్యాన్'గా అభివర్ణించడం సంతోషంగా ఉందన్నారు. తెలుగుతల్లికి జలహారతి పట్టడమే తన జీవిత లక్ష్యమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ముఖ్యమంత్రిని అభినందిస్తూ ప్రత్యేక తీర్మానం ప్రవేశపెట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో సమాచార సాంకేతిక రంగాన్ని అభివృద్ధి చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించిన చంద్రబాబు, ఇప్పుడు జల వనరుల అభివృద్ధితో 'వాటర్ మ్యాన్'గా గుర్తింపు పొందారని కొనియాడారు. పట్టిసీమ, హంద్రీనీవా, వెలిగొండ, పోలవరం వంటి ప్రాజెక్టుల ద్వారా రాష్ట్ర సమగ్రాభివృద్ధికి సీఎం మార్గదర్శకుడిగా నిలిచారని తెలిపారు. వచ్చే మూడేళ్లలో రూ.35 వేల కోట్ల వ్యయంతో 36 సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసే లక్ష్యాన్ని కూడా ఎకనామిక్ టైమ్స్ ప్రశంసించిందన్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు స్టాండింగ్ ఒవేషన్‌తో చంద్రబాబును అభినందించారు.పార్టీ బలోపేతంలో కార్యకర్తల పాత్ర అత్యంత కీలకమని చంద్రబాబు పేర్కొన్నారు. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన కార్యకర్తలకు తగిన గుర్తింపు, గౌరవం కల్పిస్తామని చెప్పారు. అనంతపురం జిల్లాకు చెందిన దళవాయి రమాదేవికి బాధ్యతలు అప్పగించడం దీనికి ఉదాహరణ అని వివరించారు. క్షేత్రస్థాయిలో సమర్థంగా పనిచేసే వారికి పార్టీలోనూ, చట్టసభల్లోనూ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. పార్టీ బలోపేతంతో పాటు కూటమి ఐక్యత కూడా అంతే ముఖ్యమని, చిన్నచిన్న వివాదాలకు - మిగతా 2లో..

## యువత భవిష్యత్తుతో రాజకీయం తగదు..

**అమరావతి, సెప్టెంబర్ 7 రాజధాని వాయిస్ :** ఏళ్ల తరబడి కష్టపడిన మెగా డీఎస్సీ అభ్యర్థుల కష్టాన్ని, విజయాన్ని అవమానించేలా వైసీపీ ఆరోపణలు చేయడం బాధాకరమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. మెగా డీఎస్సీ అభ్యర్థులను సతాయించడం, వారిపై బురదజల్లడం వైసీపీ నేతలు మానుకోవాలని హితవుపలికారు. 2018లో డీఎస్సీ రాసి ఉద్యోగం రాకపోయినా.. ఏడేళ్ల పాటు పట్టుదలతో చదివి 2025 మెగా డీఎస్సీలో ఉద్యోగాలు సాధించారని తెలిపారు. రాత్రీ పగలు తేడా లేకుండా చదివి, ఎన్నో త్యాగాలు చేసి యువత ఉద్యోగాలు సాధించిందని చెప్పుకొచ్చారు. ఇదే చివరి అవకాశం అయినా పట్టుదలతో ఉద్యోగం సాధించిన వారి విజయాన్ని రాజకీయాల కోసం అవమానించడం సరికాదన్నారు.అప్లికేషన్ల స్వీకరణ నుంచి మెరిట్ లిస్ట్ వరకు మెగా డీఎస్సీ ప్రక్రియను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించామని మంత్రి తెలిపారు. మెరిట్, అర్హత ఆధారంగా ఉద్యోగాలు పొందిన అభ్యర్థులపై బురదజల్లడం మానుకోవాలని హితవుపలికారు. మెగా డీఎస్సీలో ఎలాంటి అక్రమాలకు తావులేదన్నారు. ఉద్యోగం సాధించిన అభ్యర్థుల విజయాన్ని ప్రశ్నించడం వారి కుటుంబాల ఏళ్ల తరబడి శ్రమను అవమానించడమే అని అన్నారు. యువత భవిష్యత్తుతో రాజకీయాలు చేయడం వైసీపీకి తగదని హెచ్చరించారు. వైసీపీ రాజకీయాల కోసం అభ్యర్థుల కష్టాన్ని అవమానించొద్దని.. వారి భవిష్యత్తుతో ఆటలాడొద్దని అన్నారు. మెగా డీఎస్సీ అభ్యర్థుల ఆవేదనను జగన్ అర్థం చేసుకోవాలని మంత్రి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.

## స్వర్ణభారత్ ట్రస్ట్ రజతోత్సవ వేడుకల్లో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్

- అక్షర విద్యాలయంలో ఘన స్వాగతం పలికిన మంత్రి పొంగూరు నారాయణ
- యువత సాధికారతకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాల వివరాల వెల్లడి
- విద్య, నైపుణ్యాభివృద్ధిలో 25 ఏళ్ల ప్రస్థానాన్ని ప్రతిబింబించిన వేడుకలు



**రాజధాని వాయిస్ నెల్లూరు :** స్వర్ణభారత్ ట్రస్ట్ 25 సంవత్సరాల సేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని నిర్వహించిన రజతోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, ఆయనకు అక్షర విద్యాలయంలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఘన స్వాగతం పలికారు. విద్య, నైపుణ్యాభివృద్ధి, యువత సాధికారత రంగాల్లో స్వర్ణభారత్ ట్రస్ట్ అందిస్తున్న సేవలను ఈ సందర్భంగా ప్రముఖులకు వివరించారు. వేడుకల సందర్భంగా సోమా స్కిల్ సెంటర్‌ను సందర్శించిన - మిగతా 2లో..

## ప్రజలకు తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం, సరుకులు

- ఏపీ భవన్లో ప్రత్యేక రైస్ అవుట్‌లెట్ ప్రారంభించిన మంత్రి నాదెండ్ల మనోహర్
- రాష్ట్ర ప్రజలతో పాటు ఇతర రాష్ట్రాలకూ అత్యుత్తమ నాణ్యతతో కూడిన సరుకులు అందజేత
- కేఎన్ఎం, బీపీటీ వంటి రకరకాల బియ్యం వెరైటీలు అందుబాటులో ఉంచేలా చర్యలు
- ఎన్‌సీసీఎఫ్ ద్వారా 64 రకాల నిత్యావసర సరుకులు సబ్సిడీ ధరలతో విక్రయం



**రాజధాని వాయిస్ న్యూఢిల్లీ, సెప్టెంబర్ 7:** దేశ రాజధాని న్యూఢిల్లీలో నివసిస్తున్న రాష్ట్ర ప్రజలకు తక్కువ ధరకే అత్యుత్తమ నాణ్యతతో కూడిన బియ్యం, నిత్యావసర సరుకులను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ పౌరసరఫరాల కార్పొరేషన్ ఆధ్వర్యంలో, రెసిడెంట్ కమిషనర్ చొరవతో మిగతా 2లో..

## ఏపీ వక్ఫ్ బోర్డు డిజిటల్ పాలనలో మరో ముందడుగు

- త్వరలో వెబ్‌సైట్, మొబైల్ యాప్ ప్రారంభం
- సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభించేందుకు సన్నాహాలు
- ఇన్‌స్పెక్టర్ ఆడిటర్లు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ
- కొత్త వ్యవస్థను ప్రారంభించడమే కాదు.. క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలి
- ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్


2

# స్వర్ణభారత్ ట్రస్ట్ రజతోత్సవ వేడుకల్లో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్

యోగి ఆదిత్యనాథ్‌కు అక్కడ అమలు చేస్తున్న నైపుణ్యాభివృద్ధి, ఉపాధి శిక్షణ కార్యక్రమాల గురించి మంత్రి నారాయణ వివరించారు. యువతకు ఆధునిక నైపుణ్యాలను అందించి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా చేపడుతున్న కార్యక్రమాలు విశేష ఫలితాలను ఇస్తున్నాయని తెలిపారు. వివిధ రంగాల్లో శిక్షణ పొందిన యువత స్వయం ఉపాధి, ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు సమక్షంలో జరిగిన ఈ వేడుకల్లో కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు. స్వర్ణభారత్ ట్రస్ట్ స్థాపన నుంచి ఇప్పటి వరకు చేపట్టిన సేవా కార్యక్రమాలు, విద్యా విస్తరణ, యువత అభివృద్ధికి చేసిన కృషిని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. సమాజాభివృద్ధికి ట్రస్ట్ అందిస్తున్న సేవలను పలువురు ప్రశంసించారు. గత 25 సంవత్సరాలుగా విద్యా రంగంలో నాణ్యమైన సేవలు అందించడంతో పాటు యువతకు నైపుణ్య శిక్షణ కల్పించడంలో స్వర్ణభారత్ ట్రస్ట్ కీలక పాత్ర పోషించిందని వక్తలు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల యువతకు ప్రత్యేక అవకాశాలు కల్పిస్తూ వారిని స్వావలంబన దిశగా నడిపించడం ట్రస్ట్ ప్రత్యేకతగా నిలిచిందన్నారు. యువత సామర్థ్యాలను వెలికితీసి దేశాభివృద్ధికి తోడ్పడేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ రజతోత్సవ వేడుకలు కేవలం ఒక సంస్థ విజయగాథను మాత్రమే కాకుండా, విద్యా సేవలు మరియు యువత సాధికారతకు అంకితమైన 25 ఏళ్ల ప్రయాణాన్ని ప్రతిబింబించాయని నిర్వాహకులు తెలిపారు. సమాజంలో మార్పు తీసుకురావడంలో విద్య, నైపుణ్యాభివృద్ధి కీలకమని, ఆ దిశగా స్వర్ణభారత్ ట్రస్ట్ నిరంతరం కృషి చేస్తోందన్నారు. భవిష్యత్తులో కూడా యువత అభివృద్ధి, విద్యా విస్తరణ, నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగించనున్నట్లు ట్రస్ట్ ప్రతినిధులు వెల్లడించారు. రజతోత్సవ వేడుకలు ఘనంగా విజయవంతం కావడంతో పాటు ట్రస్ట్ సేవా కార్యక్రమాలకు మరింత ప్రోత్సాహాన్ని అందించాయని వారు పేర్కొన్నారు.

# ప్రతి ఎకరాకు నీరు




తావివ్వకుండా సమన్వయంతో పనిచేయాలని పార్టీ శ్రేణులకు సూచించారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనపై చంద్రబాబు తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్ర వ్యవస్థలను దెబ్బతీసి అభివృద్ధిని వెనక్కి నెట్టిందని ఆరోపించారు. పాలకుడు ఎలా ఉండకూడదో చెప్పడానికి గత పాలన ఒక ఉదాహరణగా నిలుస్తుందని వ్యాఖ్యానించారు. వైసీపీ ఫేక్ ప్రచారాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు సమర్థవంతంగా తిప్పికొట్టాలని, ప్రతి ఆరోపణకు వాస్తవాలతో సమాధానం ఇవ్వాలని సూచించారు. సోషల్ మీడియా వేదికలను సమర్థంగా వినియోగిస్తూ ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనను సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని చంద్రబాబు తెలిపారు. నెలకు రూ.73 వేల కోట్లతో 63 లక్షల మందికి పైగా పెన్షన్లు అందిస్తున్నామని, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, అన్న క్యాంటీన్లు వంటి పథకాలను పునరుద్ధరించామని చెప్పారు. మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టామని, రాష్ట్రంలోని మూడు ప్రాంతాల సమగ్రాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నామని వివరించారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, రాయలసీమలో పరిశ్రమల విస్తరణ, అమరావతిలో క్వాంటం టెక్నాలజీ హబ్ ఏర్పాటు వంటి కార్యక్రమాలతో రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి దిశగా తీసుకెళ్తున్నామని సీఎం తెలిపారు. భూముల భద్రత కోసం 'రాజముద్ర', బ్లాక్‌చెయిన్ సాంకేతికతలను అమలు చేస్తూ దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం చూపుతున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ సమానంగా ముందుకు తీసుకెళ్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన కొనసాగిస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు.

## కూటమి ఐక్యతకు భంగం కలిగించే పోస్టులు పెట్టొద్దు

స్పందించకుండా పార్టీ నాయకత్వం లేదా సోషల్ మీడియా విభాగం దృష్టికి తీసుకురావాలని టీడీపీ కార్యకర్తలకు సూచించింది. ఇప్పటి వరకు టీడీపీ సోషల్ మీడియా కార్యకర్తల నుంచి వచ్చిన పలు అంశాలను పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపింది. అదే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఆయన కుటుంబ సభ్యులపై అవమానకర వ్యాఖ్యలు చేసిన జనసేన కార్యకర్తల అంశాన్ని ఆ పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లగా, తగిన చర్యలు తీసుకుంటామని జనసేన నేతలు హామీ ఇచ్చినట్లు వెల్లడించింది. టీడీపీ కార్యకర్తల ఆత్మగౌరవానికి భంగం కలిగించే ఎటువంటి చర్యలనూ పార్టీ సహించదని స్పష్టం చేసిన నాయకత్వం, అదే సమయంలో కూటమి ఐక్యతను కాపాడుకోవడం కూడా ప్రతి కార్యకర్త బాధ్యత అని పేర్కొంది. పరస్పర గౌరవం, సహకారం, క్రమశిక్షణతో వ్యవహరిస్తూ పార్టీ ఆదేశాలను పాటిస్తేనే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయపథంలో సాగుతుందని, అందరూ సంయమనంతో వ్యవహరించాలని పిలుపునిచ్చింది.

# తెలుగు జాతి ఆస్తి చంద్రబాబు: పయ్యావుల

దేశానికి ఆదర్శంగా నిలిచిందని అన్నారు. ఈ సందర్భంగా 'స్వర్ణాంధ్ర విజన్-2047' పత్రంపై పయ్యావుల కేశవ్ ప్రత్యేక ప్రజెంటేషన్ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిని చంద్రబాబు నాయకత్వానికి ముందు, తర్వాత అనే కోణంలో విశ్లేషించుకోవాలని సూచించారు. రాష్ట్ర భవిష్యత్తు నిర్మాణంలో దీర్ఘకాలిక ప్రణాళికలకు చంద్రబాబు ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. గతంలో చంద్రబాబు రూపొందించిన 'విజన్-2020' పత్రాన్ని కొందరు విమర్శించినప్పటికీ, అదే దేశంలో తొలి సమగ్ర అభివృద్ధి దిశానిర్దేశక పత్రంగా నిలిచిందని గుర్తుచేశారు. అనంతరం అనేక రాష్ట్రాలు కూడా అలాంటి ప్రణాళికలను రూపొందించాయని చెప్పారు. ఆలోచనలను కార్యరూపంలోకి తీసుకురావడంలో చంద్రబాబు ప్రత్యేక నైపుణ్యం కలిగిన నాయకుడని కొనియాడారు. సమాచార సాంకేతిక రంగ అభివృద్ధికి చంద్రబాబు చేసిన కృషిని పయ్యావుల ప్రత్యేకంగా ప్రస్తావించారు. సాంకేతిక నగరం ఏర్పాటుకు ముందే రాష్ట్రంలో వందలాది ఇంజినీరింగ్ కళాశాలలను ప్రోత్సహించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించారని తెలిపారు. దాని ఫలితంగానే ప్రపంచవ్యాప్తంగా తెలుగువారు సాంకేతిక రంగంలో గుర్తింపు పొందారని పేర్కొన్నారు. రాష్ట్రంలో నీటి వనరుల వినియోగంలో కూడా చంద్రబాబు దూరదృష్టి కనబరిచారని మంత్రి అన్నారు. ఒకప్పుడు నీటి కోసం ప్రాంతాల మధ్య వివాదాలు ఉండేవని, కానీ గోదావరి జలాలను తరలించే ప్రాజెక్టుల ద్వారా సాగునీటి పరిస్థితిని మెరుగుపరిచారని చెప్పారు. నీటి నిర్వహణలో చేపట్టిన చర్యలు వ్యవసాయాభివృద్ధికి దోహదపడ్డాయని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో నియోజకవర్గాల వారీగా అభివృద్ధి దిశగా ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నామని పయ్యావుల కేశవ్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి నియోజకవర్గంలో ప్రజలకు ఉపయోగపడే కొత్త ఆవిష్కరణలు చేపట్టాలని పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు.

# ప్రజలకు తక్కువ ధరకే నాణ్యమైన బియ్యం, సరుకులు



ఏపీ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక రైస్ అవుట్‌లెట్‌ను పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. మన రైతాంగం కష్టపడి పండించిన ధాన్యం రాష్ట్రవ్యాప్తంగానే కాకుండా జాతీయ స్థాయిలోనూ అద్భుతమైన గుర్తింపు తెచ్చుకుందని కొనియాడారు. ముఖ్యంగా ఢిల్లీ నగరంలో స్థిరపడిన, నివసిస్తున్న తెలుగు ప్రజలందరికీ స్వచ్ఛమైన, నాణ్యమైన మన ఊరి రుచులను, వరి వంగడాలను అందించాలనే ఉద్దేశంతోనే ఈ అవుట్‌లెట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆయన వెల్లడించారు. రాబోయే రోజుల్లో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు. కేఎన్ఎం, బీపీటీ వంటి వివిధ రకాల బియ్యం వెరైటీలతో పాటు, ఎన్‌సీసీఎఫ్ (NCCF) ద్వారా సేకరించిన 64 రకాల నాణ్యమైన సరుకులను కూడా సబ్సిడీ రేట్లతో ఈ కౌంటర్ ద్వారా విక్రయించనున్నట్లు తెలిపారు. ప్రజలకు అందించే ఈ సేవల్లో ఎటువంటి లోపాలు తలెత్తకుండా అర్హత గల నిపుణులను నియమించి పారదర్శకంగా సేవలు అందిస్తామని మంత్రి ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఏపీ భవన్ స్పెషల్ కమిషనర్ అర్జా శ్రీకాంత్, ప్రభుత్వ సలహాదారు ఏకే జైన్, ఏపీ భవన్ అధికారులు, మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ వక్ఫ్ బోర్డు డిజిటల్ పాలనలో మరో ముందడుగు

**అమరావతి, సెప్టెంబర్ 7రాజధాని వాయిస్ : :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డును ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దే దిశగా మరో కీలక ముందడుగు పడిందని ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. బోర్డు సేవలు, కార్యకలాపాలను డిజిటలైజ్ చేసేందుకు ప్రత్యేకంగా వెబ్‌సైట్, మొబైల్ యాప్ రూపొందించామని, త్వరలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అధికారికంగా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వక్ఫ్ బోర్డు కార్యాలయంలో సీఈఓ యాకూబ్ ఖాజీ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ ఆడిటర్లు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభంలో చైర్మన్ అబ్దుల్ అజీజ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొని సందేశం అందించారు. చైర్మన్ మాట్లాడుతూ, కొత్త వ్యవస్థను ప్రారంభించడం ఒక్కటే కాదని, దాన్ని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడం కూడా అంతే ముఖ్యమని అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. ఈ డిజిటల్ మార్పులో క్షేత్రస్థాయి సిబ్బంది పాత్ర కీలకమన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కొనసాగుతున్న డిజిటల్ గవర్నెన్స్‌కు అనుగుణంగా వక్ఫ్ బోర్డులోనూ ఆధునిక సాంకేతిక విధానాలను అమలు చేస్తున్నామని తెలిపారు. అధికారిక ప్రారంభానికి ముందే సిబ్బందిని కొత్త వ్యవస్థ వినియోగానికి సిద్ధం చేస్తున్నామని, తద్వారా పరిపాలనలో పారదర్శకత, వేగం, జవాబుదారీతనం మరింత పెరుగుతాయని పేర్కొన్నారు. చైర్మన్ సందేశం అనంతరం ప్రాక్టికల్ శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రత్యేకంగా రాజుణ స్క్రీన్ ఏర్పాటు చేసి, వెబ్‌సైట్, మొబైల్ యాప్ వినియోగాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శించారు. లాగిన్, సమాచార నమోదు, ఇప్పటికే ఉన్న వివరాల పరిశీలన, అప్‌డేషన్, క్షేత్రస్థాయి సమాచారాన్ని డిజిటల్ వ్యవస్థలో పొందుపరిచే విధానాలను దశలవారీగా వివరించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఆడిటర్లు, సిబ్బంది లేవనెత్తిన సందేహాలను నివృత్తి చేశారు. డీఈఈ అబ్దుల్ ఖాదిర్ పాల్గొన్నారు.

# అమరావతే రాజధాని

పార్టీకి మార్గనిర్దేశం చేసే పాత్రలో మాత్రమే ఉంటానని, నాయకత్వ బాధ్యతలను యువతకు అప్పగిస్తామని తెలిపారు. తన కుటుంబ సభ్యులు కూడా రాజకీయ పదవులు చేపట్టరని పేర్కొంటూ కుటుంబ రాజకీయాలకు తావు ఉండదని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై కూడా విజయసాయిరెడ్డి ప్రశ్నలు లేవనెత్తారు. రాష్ట్ర విభజన సమయంలో ఉన్న అప్పులు గత కొన్నేళ్లలో భారీగా పెరిగాయని పేర్కొంటూ, ఆ నిధులు ఎలా వినియోగించబడ్డాయనే అంశంపై సమగ్ర చర్చ అవసరమన్నారు. ప్రజలపై ఆర్థిక భారం పెరగడానికి గల కారణాలను వెలికితీయాల్సిన అవసరం ఉందని అభిప్రాయ పడ్డారు. నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్ చార్జీలు, ఇంటి అద్దెలు పెరగడం ప్రజల జీవన వ్యయాన్ని అధికం చేసిందని విజయసాయిరెడ్డి అన్నారు. ధరల నియంత్రణ, ఉపాధి కల్పన, పరిశ్రమల ప్రోత్సాహం, యువతకు అవకాశాల సృష్టి వంటి అంశాలపై తమ పార్టీ ప్రత్యేక దృష్టి సారిస్తుందని వెల్లడించారు. త్వరలో పార్టీ నిర్మాణం, విధివిధానాలు, నాయకత్వ వ్యవస్థపై మరిన్ని వివరాలు ప్రకటిస్తామని తెలిపారు.

# 913 ఆశా పోస్టుల భర్తీకి ఆమోదం

సంబంధిత గ్రామం లేదా వార్డుకు చెందిన స్థానిక మహిళలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. పదో తరగతి కనీస విద్యార్హతతో పాటు 25--45 ఏళ్ల వయసు ఉన్న మహిళలు అర్హులు.

నియమ నిబంధనలకు అనుగుణంగా నియామకాల జాబితాలను ఈ నెల 30వ తేదీలోగా పంపించాలని జిల్లాలకు ఆదేశాలు జారీ చేసినట్లు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ చక్రధర్ బాబు తెలిపారు.

**జిల్లాల వారీగా ఖాళీలు**

అనకాపల్లి 77, కర్నూలు 65, తూర్పుగోదావరి 44, అల్లూరి సీతారామరాజు 43, పార్వతీపురం మన్యం 43, పశ్చిమగోదావరి 42, అన్నమయ్య 41, ప్రకాశం 38, వైఎస్సార్ కడప 38, కృష్ణా 37, విశాఖపట్నం 33, చిత్తూరు 32, కోనసీమ 32, పల్నాడు 31, విజయనగరం 31, కాకినాడ 29, ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు 29, ఏలూరు 27, అనంతపురం 26, మార్కాపురం 25, శ్రీ సత్యసాయి 22, శ్రీకాకుళం 22, గుంటూరు 21, నంద్యాల 21, పోలవరం 21, తిరుపతి 21, ఎన్టీఆర్ జిల్లా 15, బాపట్లలో 7 చొప్పున పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

**నెలకు రూ.10 వేల వేతనం**

ఒక్కో ఆశా కార్యకర్తకు నెలకు రూ.10 వేల వేతనం అందుతుంది. ఇందులో రూ.8,320 రాష్ట్ర ప్రభుత్వం, మిగిలిన మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం భరిస్తుంది. ఏటా ఆశా కార్యకర్తల వేతనాల కోసం సుమారు రూ.513 కోట్లు ఖర్చు చేస్తున్నారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ.426.84 కోట్ల వరకు భరిస్తుండగా, మిగిలిన మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం అందిస్తోంది.

## మెగా డీఎస్సీ.. పారదర్శకంగా స్పోర్ట్స్ కోటా పోస్టుల ఎంపిక: శాప్ ఎండీ

**అమరావతి, సెప్టెంబర్ 7 రాజధాని వాయిస్** ఏపీలో నిర్వహించిన మెగా డీఎస్సీ)పై కొందరు ఇంకా దుష్ప్రచారం చేస్తున్నారని శాప్ ఎండీ భరణి పేర్కొన్నారు. స్పోర్ట్స్ కోటాలో పోస్టుల ఎంపిక పారదర్శకంగా జరిగినట్లు ఆమె వెల్లడించారు. రాష్ట్ర సచివాలయంలో పాఠశాల విద్య కమిషనర్ తమీమ్ అన్సారియాతో కలిసి భరణి మీడియా సమావేశం నిర్వహించారు. "జూడో గురించి నిరాధార ఆరోపణలు చేస్తున్నారు. పోస్టులు రానివారి వద్దకు వెళ్లి కావాలనే ఆరోపణలు చేయిస్తున్నారు. క్రీడా సంఘాల గురించి గతంలోనే స్పష్టంగా చెప్పాం. జూడో కోటా ఎంపిక చేసినవారిపై పిటిషన్ వేశారు. డీవోపీటీ చెప్పినదాన్నే మేం అమలుచేశాం. ఎలాంటి మార్పులు చేయలేదు. జూడో సంఘం ఇచ్చిన ప్రతి ధ్రువపత్రాన్ని పరిశీలించాం. హైకోర్టు ఆదేశాలు పాటించామని గతంలోనే స్పష్టం చేశాం. ఒకే టోర్నీలో ఆడిన భార్యాభర్తలనూ పరిగణనలోకి తీసుకున్నాం. చదువుకున్నప్పుడే పోటీల్లో పాల్గొనాలనే నిబంధనలు ఏమీ లేవు. కర్ణాటకలో చదువుకుంటున్నా ఏపీ నిర్వహించే పోటీల్లో పాల్గొనవచ్చు. జిల్లాల పరిధిలో ఆడాలంటే ఆయా క్రీడా సంఘాలు ధ్రువీకరించాలి. బాక్సింగ్‌లో ఏపీకి పేరు తెచ్చిన అప్పలరా జుపై దుష్ప్రచారం చేస్తున్నారు. కొనద పద్మజ వయసుపైనా తప్పుడు ప్రచారం జరుగుతోంది." అని శాప్ ఎండీ భరణి అన్నారు. ఒకసారి టెట్ రాస్తే చాలు.. జీవితాంతం అమల్లో ఉంటుందని తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ దివ్యాంగులకు అర్హత మార్కులు వేర్వేరుగా ఉంటాయన్నారు. టెట్‌కు 20 శాతం వెయిటేజ్ ఉంటుందన్నారు.

## పార్టీ అప్పగించిన పనులను తప్పనిసరిగా పూర్తి చేయాల్సిందే: మంత్రి లోకేశ్



**అమరావతి, సెప్టెంబర్ 7రాజధాని వాయిస్ :** : పార్టీయే సుప్రీం అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసి డెంట్ నారా లోకేశ్ స్పష్టం చేశారు. పార్టీ పదవుల్లో ఉన్న వారిని మంత్రులైనా.. ఎమ్మెల్యేలైనా గౌరవించాల్సిందేనని ఆదేశిం చారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో రెండు రోజుల పాటు జరగనున్న ఈ వర్క్‌షాప్‌లో లోకేశ్ పాల్గొని ప్రసంగించారు.

**ఆ పనులను తప్పనిసరిగా పూర్తి చేయాల్సిందే..**

పార్టీ ఏదైనా పని చెబితే.. దానికే ప్రయారిటీ ఇవ్వాలని మంత్రి లోకేశ్ దిశానిర్దేశం చేశారు. క్వాంటం టవర్స్‌కు సంబంధించిన ఓ కార్యక్రమం ఉందని తనను ఆహ్వానిస్తే... పార్టీ తనకో పని అప్పచెప్పిందని... తాను రానని స్పష్టం చేశానని పేర్కొన్నారు. పార్టీ ఇచ్చిన పనులను తప్పనిసరిగా పూర్తి చేయాల్సిందే... దానికే హై ప్రయారిటీ ఇవ్వాలని ఆదేశించారు. పార్టీ పదవుల్లో ఉన్న వారు.. పార్టీ కార్యక్రమాలకు హాజరు కావడానికి ఎవరి అనుమతి అవసరం లేదని క్లారిటీ ఇచ్చారు. పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఉన్న చంద్రబాబు బీ-ఫారం ఇవ్వకుంటే మంత్రులు కాలేరని, ఎమ్మెల్యేలు కారని తేల్చిచెప్పారు.

**మై-టీడీపీ యాప్‌లో పార్టీ కార్యక్రమాల వివరాలను అప్‌డేట్ చేస్తున్నాం..**

పార్టీని నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు ఉండదనే విషయాన్ని.. ప్రతి క్షణం గుర్తుంచుకోవాలని మంత్రి లోకేశ్ సూచించారు. ఆయా నియోజకవర్గాల్లో పార్టీ కార్యక్రమాలు ఏ విధంగా జరుగుతున్నాయనేది.. నిరంతరం సమీక్షించుకుంటూ టీడీపీ కేడర్ వెళ్లాలని సూచించారు. మై-టీడీపీ యాప్‌లో పార్టీ కార్యక్రమాల వివరాలను పూర్తిగా అప్‌డేట్ చేస్తున్నామని వెల్లడించారు. ఆ సమాచారం ఆధారంగా పార్టీ కార్యక్రమాల నిర్వహణపై ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని మంత్రి నారా లోకేశ్ మార్గనిర్దేశం చేశారు.

## యూట్యూబర్ నందన అరెస్ట్



**రాజధాని వాయిస్ హైదరాబాద్ :** ప్రముఖ యూట్యూబర్ నందనను శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమెపై ఇప్పటికే లుకౌట్ నోటీసులు జారీ కావడంతో ఇమ్మిగ్రేషన్ అధికారులు గుర్తించి ఎయిర్‌పోర్ట్ పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం ఆమెను కేసు విచారణ చేపడుతున్న ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. పోలీసుల వివరాల ప్రకారం నందన, ఆమె భర్త కలిసి లండన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మబలికి పలువురి నుంచి భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. విదేశీ ఉద్యోగాల పేరుతో మోసపోయామని బాధితులు చేసిన ఫిర్యాదుల ఆధారంగా ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంపై కొంతకాలంగా దర్యాప్తు కొనసాగుతోంది. దర్యాప్తులో భాగంగా నందనపై లుకౌట్ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. విదేశాలకు వెళ్లే అవకాశం ఉందన్న అనుమానంతో ఆమె కదలికలపై పోలీసులు నిఘా ఉంచారు. ఈ నేపథ్యంలో సోమవారం శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చిన ఆమెను ఇమ్మిగ్రేషన్ అధికారులు గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఎయిర్‌పోర్ట్ పోలీసులు నందనను అదుపులోకి తీసుకుని అవసరమైన ధృవీకరణ ప్రక్రియ పూర్తి చేశారు. అనంతరం కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్న ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు. ఆమె నుంచి మరిన్ని వివరాలు సేకరించేందుకు పోలీసులు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ కేసులో బాధితుల సంఖ్య, వసూలు చేసిన మొత్తాలపై కూడా పోలీసులు దృష్టి సారించారు. విదేశీ ఉద్యోగాల పేరుతో మరెవరైనా మోసపోయారా అనే కోణంలో కూడా విచారణ కొనసాగుతోంది. నందనతో పాటు ఆమె భర్త పాత్రపై కూడా అధికారులు సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా వెలుగులోకి రావాల్సి ఉంది. బాధితుల ఫిర్యాదులు, ఆర్థిక లావాదేవీల ఆధారాలు, ఇతర సాక్ష్యాలను పరిశీలిస్తూ పోలీసులు కేసు దర్యాప్తును కొనసాగిస్తున్నారు. విచారణలో బయటపడే అంశాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

## ఏఐతో మానవ మేధస్సుకు ముప్పు.. రామ్ గోపాల్ వర్మ

**రాజధాని వాయిస్ :హైదరాబాద్, సెప్టెంబర్ 7:** విలక్షణ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మరోసారి తనదైన శైలిలో సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రభావంపై స్పందించిన ఆయన, భవిష్యత్తులో మానవ మేధస్సు, సృజనాత్మకతకు తీవ్రమైన సవాళుఎదురయ్యే అవకాశం ఉందని అభిప్రాయ పడ్డారు. ఒకప్పుడు పారిశ్రామిక విప్లవం శారీరక శ్రమ ఆధారిత ఉద్యోగాల ను ప్రభావితం చేసినట్లే, ఇప్పుడు ఏఐ ఆలోచన ఆధారిత ఉద్యోగాలపై ప్రభావం చూపబోతోందని హెచ్చరించారు. ఈ మేరకు తన సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో వర్మ సుదీర్ఘ పోస్టు చేశారు. ఏఐని సమయానికి అర్థం చేసు కుని వినియోగించుకోని వారి ఉద్యోగాలే ముందుగా ప్రమాదంలో పడతా యని పేర్కొన్నారు. సాంకేతికత ఎప్పుడూ మానవ జీవితాన్ని సులభతరం చేయడానికే రూపొందించబడిందని, శారీరక శ్రమను తగ్గించడంతో పాటు సమయాన్ని ఆదా చేయడమే దాని ప్రధాన లక్ష్యమని వివరించారు. మానవులు ఎప్పుడూ ఎక్కువ స్వేచ్ఛా సమయం కోరుకుంటారని, ఇప్పుడు ఏఐ ఆ స్వేచ్ఛను మరింత విస్తృతంగా అందించే దిశగా పయనిస్తోందని వర్మ అభిప్రా యపడ్డారు. అయితే అదే సమయంలో ఈ పరిణామం కొత్త సవాళ్లకు కూడా దారితీస్తుందని సూచించారు. సాంకేతిక పురోగతి ఎంత వేగంగా ముందుకు వెళ్తుందో, దానికి అనుగుణంగా మనుషులు కూడా తమ నైపుణ్యాలను మార్చుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. తన పోస్టులో మానవుల ప్రధాన బలాలను ప్రస్తావించిన వర్మ, మనిషికి ఉన్న రెండు ప్రధాన ఆస్తులు కండబలం, ఆలోచించే మెదడేనని పేర్కొన్నారు. పారిశ్రామిక విప్లవం కండబ లం అవసరాన్ని గణనీ యంగా తగ్గించిందని, ఇప్పుడు ఏఐ ఆలోచనా శక్తి ఆధారిత పనులపై ప్రభావం చూపుతోందని వ్యాఖ్యానించారు. ఇది సాంకేతి క అభివృద్ధిలో మరో కీలక మలుపుగా ఆయన అభివర్ణించారు.

# వైఎస్సార్ 17వ వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరం

- ఫీనిక్స్ వైఎస్సార్‌సీపీ ఎన్నారై కమిటీ ఆధ్వర్యంలో నిర్వహణ
- వర్చువల్‌గా ప్రారంభించిన ఆలూరు సాంబశివ రెడ్డి
- సేవా కార్యక్రమాలతో వైఎస్సార్‌కు నివాళులర్పించిన ఎన్నారైలు



**రాజధాని వాయిస్ ఫీనిక్స్ (అమెరికా) :** మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 17వ వర్ధంతిని పురస్కరించుకుని ఫీనిక్స్ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్నారై కమిటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. వైఎస్సార్ సేవా స్ఫూర్తిని స్మరించుకుంటూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎన్నారైలు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. సమాజ సేవే వైఎస్సార్ ఆశయమని గుర్తు చేస్తూ ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ రక్తదాన శిబిరాన్ని గ్లోబల్ వైఎస్సార్‌సీపీ ఎన్నారై కో-ఆర్డినేటర్ ఆలూరు సాంబశివ రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ జీవితమంతా పేదలు, రైతులు, బలహీన వర్గాల సంక్షేమానికే అంకితమైందని అన్నారు. ఆయన చూపిన సేవా మార్గంలో నడుస్తూ ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను చేపట్టడం నిజమైన నివాళి అని పేర్కొన్నారు. రక్తదానం మహాదానం అనే భావనతో ఎన్నారైలు స్వచ్ఛందంగా ముందుకు రావడం అభినందనీయమని నిర్వాహకులు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమయ్యే రోగులకు ఈ కార్యక్రమం ద్వారా ఉపయోగం చేకూరుతుందని చెప్పారు. సమాజానికి మేలు చేసే కార్యక్రమాల్లో వైఎస్సార్ అభిమానులు ఎల్లప్పుడూ ముందుంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ధీరజ్ పోలా, వంశీ ఎరువరం, చెన్నారెడ్డి మద్దూరి, రుక్మన్, శ్రీధర్ చెమిడితి, అంజి రెడ్డి, నాగేష్ పోర్ల, వేమ శేఖర్, విఘ్నేష్, కొండారెడ్డి, శ్రీనివాస్ మామిడి, హేమకుమార్, అజయ్ కాల్వ, కుడుముల సుధీర్, సుజన్, రాజేశ్వరరావు బండారు, రాజశేఖర్ అవుదూరి, హితేష్ తదితరులు పాల్గొన్నారు. రక్తదానంతో పాటు వైఎస్సార్ సేవలను గుర్తు చేసుకుంటూ ఆయనకు ఘన నివాళులు అర్పించారు. వైఎస్సార్ ప్రజా సంక్షేమ పాలన, పేదల పట్ల ఆయన చూపిన అంకితభావం ఇప్పటికీ కోట్లాది మందికి స్ఫూర్తిగా నిలుస్తోందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్ వంటి పథకాల ద్వారా ఆయన ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి కార్యకర్త బాధ్యత అని చెప్పారు. రక్తదాన శిబిరం విజయవంతం కావడంతో నిర్వాహకులు పాల్గొన్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ వైఎస్సార్ ఆశయాలను ప్రపంచవ్యాప్తంగా విస్తరించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమం ద్వారా వైఎస్సార్ స్ఫూర్తి సజీవంగా ఉందని మరోసారి చాటిచెప్పారు.

# శింగనమల రైతులకు హెచ్ఎల్సీ నీరు ఇవ్వాలి

- ఎంపీఆర్ డ్యామ్‌కు నీటి విడుదల కోరుతూ వినతిపత్రం
- ఎండిన పంటలతో కలెక్టర్‌ను కలిసిన రైతులు
- సాగు, తాగునీటి సమస్యలపై వైఎస్సార్సీపీ ఆందోళన
- రైతు హక్కుగా నీరు అందించాలని శైలజానాథ్ డిమాండ్



**రాజధాని వాయిస్ :అనంతపురం, సెప్టెంబర్ 7 :** అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గంలోని హెచ్ఎల్సీ కాలువల దిగువ ఆయకట్టు ప్రాంతాలకు, తాడిపత్రి బ్రాంచ్ కెనాల్, సుబ్బరాయ సాగర్ పరిధికి తక్షణం సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్సీపీ నేతలు, రైతులు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజానాథ్ ఆధ్వర్యంలో రైతులు ఎండిపోయిన పంటలను చేతబట్టి కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని తమ సమస్యలను వివరించారు. హెచ్ఎల్సీ నీరు ప్రతి సంవత్సరం ఎంపీఆర్ డ్యామ్ దక్షిణ కాలువ ద్వారా రైతులకు హక్కుగా అందుతోందని, అయితే ఈసారి శింగనమల నియోజకవర్గానికి నీరు ఇవ్వడం సాధ్యం కాదని ఐఏబీ సమావేశంలో నిర్ణయించడం రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేసిందని శైలజానాథ్ అన్నారు. కనేకల్లు చెరువు, హెచ్ఎల్ఎంసీ, జీబీసీ ఆయకట్టుకు మాత్రమే నీరు అందిస్తామని, ఎంపీఆర్ డ్యామ్, పులివెందుల బ్రాంచ్ కెనాల్ పరిధి రైతులను విస్మరించడం అన్యాయమని విమర్శించారు. సెప్టెంబర్ నెలలోకి వచ్చినా సరైన వర్షాలు లేకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని, బోర్లు ఎండిపోతుండటంతో రైతులు పంటలు సాగు చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికే సాగులో ఉన్న పండ్ల తోటలను కాపాడుకోవడానికి రైతులు ఒక్కో ట్యాంకర్‌కు వందల రూపాయలు ఖర్చు చేస్తూ నీటిని కొనుగోలు చేస్తున్నారని, ఈ పరిస్థితి ఎక్కువకాలం కొనసాగితే ఉద్యానవనాలు పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చెందిన ప్రాంతంలో రైతులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపించారు. మరోవైపు ప్రజలు, పశువులకు కూడా తాగునీటి సమస్య తీవ్రమవుతోందని పేర్కొన్నారు. శ్రీశైలం నుంచి భారీగా నీరు విడుదలవుతున్న పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న నీటిని వినియోగించి హెచ్ఎల్సీ చివరి ఆయకట్టు రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.హెచ్ఎల్సీ దిగువ ప్రాంతాలకు తక్షణం సాగునీరు విడుదల చేయాలని, ఎంపీఆర్ డ్యామ్ నీటి లభ్యతపై సమీక్ష నిర్వహించాలని, నీటి పంపిణీలో ఎక్కడైనా అన్యాయం జరిగితే సరిదిద్దాలని కలెక్టర్‌ను కోరారు. అలాగే ఎండిపోతున్న ఉద్యాన పంటలను కాపాడేందుకు అత్యవసర చర్యలు, ట్యాంకర్ సదుపాయాలు కల్పించాలని, గ్రామాల్లో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఇది రాజకీయ డిమాండ్ కాదని, రైతుల బతుకులు, ప్రజల తాగునీటి అవసరాలు, పశువుల ప్రాణాలను కాపాడేందుకు చేస్తున్న విజ్ఞప్తి మాత్రమేనని డాక్టర్ సాకే శైలజానాథ్ స్పష్టం చేశారు. “నీరు రైతు హక్కు. రైతు బతుకు ప్రభుత్వ బాధ్యత” అని పేర్కొంటూ శింగనమల రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకోవాలని కోరారు.

# తిరుమలలో కట్టుదిట్టమైన భద్రతా తనిఖీలు

- వాహనాల నిల్వ ప్రాంతంలో విస్తృత పరిశీలన
- భద్రతా చర్యల్లో భాగంగా ప్రత్యేక తనిఖీలు
- అనుమానాస్పద పరిస్థితులపై అప్రమత్తంగా నిఘా
- భక్తుల భద్రతకు ప్రాధాన్యం



**రాజధాని వాయిస్ తిరుమల :** తిరుమలలో భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పోలీసు శాఖ ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహించారు. సెక్టార్--1 పరిధిలోని హెచ్‌డీ కాంప్లెక్స్ వాహనాల నిల్వ ప్రాంతంలో ప్రత్యేక బృందం సిబ్బంది విస్తృతంగా పరిశీలనలు చేపట్టారు. భక్తుల రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. తిరుమలకు నిత్యం వేలాది మంది భక్తులు తరలివస్తుండటంతో భద్రతా ఏర్పాట్లను మరింత పటిష్టం చేశారు. వాహనాల నిల్వ ప్రాంతంలో నిలిపిన ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ ఎలాంటి అనుమానాస్పద వస్తువులు ఉన్నాయా అనే అంశంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయి.తనిఖీల సమయంలో సిబ్బంది మొత్తం ప్రాంతాన్ని పరిశీలించి భద్రతకు విఘాతం కలిగించే అంశాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో పరిశీలనలు చేపట్టారు. ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాలు, వాహనాల నిల్వ కేంద్రాలు, ముఖ్య కూడళ్ల వద్ద అప్రమత్తంగా నిఘా కొనసాగించారు. ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తూ భద్రతా వ్యవస్థను బలోపేతం చేస్తున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా, అదే సమయంలో పూర్తి భద్రత కల్పించే విధంగా పోలీసులు చర్యలు చేపడుతున్నారు. తిరుమలలో ప్రశాంత వాతావరణం కొనసాగేందుకు అవసరమైన అన్ని చర్యలను అమలు చేస్తున్నారు. ఎలాంటి అనుమానాస్పద పరిస్థితులు తలెత్తకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోంది.భద్రతా ఏర్పాట్లలో భాగంగా ప్రజల సహకారం కూడా అవసరమని అధికారులు సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపించిన వెంటనే పోలీసు సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు. భక్తుల అప్రమత్తత కూడా భద్రతా పరిరక్షణలో కీలకమని తెలిపారు. తిరుమలలో భక్తుల రక్షణే ప్రధాన లక్ష్యంగా పోలీసు శాఖ పనిచేస్తోందని అధికారులు పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి తనిఖీలు మరింత విస్తృతంగా నిర్వహిస్తూ, భక్తులకు సురక్షితమైన వాతావరణం కల్పించేందుకు చర్యలు కొనసాగిస్తామని వెల్లడించారు.

# యువత భవిష్యత్తుపై జగన్ కుట్రలు: ఎమ్మెల్యే గల్లా మాధవి!

**గుంటూరు, రాజధాని వాయిస్ :** గుంటూరు ఎమ్మెల్యే గల్లా మాధవి కూటమి ప్రభుత్వం ఏ మంచి పని చేసినా అడ్డుకోవడం, తప్పుడు ప్రచారం చేయడమే పనిగా జగన్ రెడ్డి, గొడ్డలి పార్టీలు పెట్టుకున్నాయని టీడీపీ ఎమ్మెల్యే గల్లా మాధవి మండిపడ్డారు. సోమవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆమె మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మెగా డిఎస్సి కూడా గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోంది.ప్రతి విషయంలో ఒక ట్రాన్స్పరెంట్ గా డిఎస్సిని 148 రోజుల్లో నిర్వహించాం. దాదాపు 15,941 ఉద్యోగాలను రికార్డ్ టైంలో భర్తీ చేస్తే... ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేని, ఒక్క డిఎస్సి కూడా పెట్టలేని జగన్ రెడ్డి నేడు నోటికొచ్చినట్టు మాట్లాడుతూ తప్పుడు ప్రచారం చేస్తున్నాడు. ఆర్బీఐ నిర్వహించే విధంగా మంత్రి నారా లోకేష్ మెగా డిఎస్సిని నిర్వహించారు. జాబ్ క్యాలెండర్, ఇళ్ల పట్టాలు, పేదలకు ఇళ్లు వంటి అనేక హామీలు ఇచ్చి జగన్ రెడ్డి రాష్ట్ర ప్రజలను మోసం చేస్తే. మేం ఇచ్చిన మాట ప్రకారం జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తున్నాం.సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. ఏటా డిఎస్సి నిర్వహించేలా ప్రణాళికలు రచించాం. యువతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూనే మెగా డిఎస్సి నిర్వహించాం. 2026 మే నుంచి గొడ్డలి పార్టీ ఒక తామాషా ప్రారంభించింది. హై కోర్టుకు పోవడం పిల్ వేయడం, కోర్టు కొట్టేయడం, వైసీపీ నాయకులకు చివాట్లు పెట్టడం షరమాములుగా అయింది. ఇప్పుడు కొత్తగా కూటమి ప్రభుత్వంపై డిక్టేటర్ షిప్ అంటూ సోషల్ మీడియాతో తప్పుడు ప్రచారం చేస్తున్నారు. హైకోర్టు చెప్పింది కూడా అర్థం చేసుకోలేని అజ్ఞాలు వైసీపీలో కొనసాగుతున్నారు. రాజకీయం చేయాలంటే చాలా అంశాలు ఉన్నాయి.కానీ మన పిల్లల భవిష్యత్‌పై జగన్ రెడ్డి దాడి చేస్తున్నాడు. ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రెస్ మీట్ పెట్టి మరీ ఎలాంటి తప్పు జరగలేదని చెబుతున్నా కూడా వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోంది. సీబీఐ విచారణ దేనికి వేస్తారో కూడా తెలియని అసమర్థుడు జగన్.జగన్ రెడ్డి రాజకీయ జీవితమే ఒక ఫేక్. అందుకే ఆయనకు ప్రతిదీ ఫేక్ లా కనిపిస్తుంది. తప్పుడు ప్రచారాలు చేస్తే ప్రభుత్వం చూస్తూ ఊరుకుంటుందా? కర్నూలు జిల్లాకు చెందిన భార్య, భర్తల కరిష్మా, షేక్ ఇమామ్‌లపై కావాలనే తప్పుడు ప్రచారం చేస్తూ విమర్శలు చేస్తున్నారు. ఒక్క ఆధారం కూడా లేకుండానే డిఎస్సిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. చదువుతున్నప్పుడు మాత్రమే స్పోర్ట్ సర్టిఫికేట్ తెచ్చుకోవాలని ఏ రూల్స్ ప్రకారం ఉందో గొడ్డలి పార్టీ నాయకులు సమాధానం చెప్పాలి.భార్య ఒక కేటగిరి, భర్త మరో కేటగిరిలో ప్రతిభ చాటారు.

# బైండ్ ఓవర్ ఉల్లంఘన..

## - రౌడీషీటర్‌కు జ్యుడీషియల్ కస్టడీ

- నిబంధనలు అతిక్రమించిన వ్యక్తిపై చర్యలు
- 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధింపు
- నేర ప్రవృత్తిని విడిచిపెట్టాలని పోలీసుల సూచన
- శాంతిభద్రతల పరిరక్షణకు కఠిన చర్యలు



**తిరుపతి రాజధాని వాయిస్ :** బైండ్ ఓవర్ నిబంధనలను ఉల్లంఘించిన రౌడీషీటర్‌పై తిరుపతి జిల్లా పోలీసులు కఠిన చర్యలు తీసుకున్నారు. బండి జయచంద్ర అనే రౌడీషీటర్ బైండ్ ఓవర్ షరతులను పాటించకుండా వ్యవహరించినట్లు గుర్తించిన పోలీసులు అతనిపై చట్టపరమైన చర్యలు చేపట్టారు. అనంతరం కోర్టు ఆదేశాల మేరకు అతనికి 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించబడింది. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తున్న పోలీసు శాఖ, నేర చరిత్ర కలిగిన వ్యక్తులపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తోంది. ఈ క్రమంలో బైండ్ ఓవర్ చేసిన వ్యక్తులు నిబంధనలను కచ్చితంగా పాటిస్తున్నారా అనే అంశాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోంది. ఉల్లంఘనలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు.బైండ్ ఓవర్ విధానం ద్వారా నేరాలకు దూరంగా ఉండాలని, సత్ప్రవర్తనతో జీవించాలని సంబంధిత వ్యక్తులకు ముందుగానే సూచనలు ఇస్తారు. అయినప్పటికీ నిబంధనలను అతిక్రమించి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకునే అధికారం పోలీసులకు ఉంటుంది. ఈ కేసులో కూడా అదే విధంగా వ్యవహరించినట్లు అధికారులు తెలిపారు. నేర ప్రవృత్తిని విడిచిపెట్టి సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా జీవించాలని తిరుపతి జిల్లా పోలీసులు సూచించారు. ఒకసారి చట్టపరమైన అవకాశాన్ని ఇచ్చిన తర్వాత కూడా మార్పు రాకపోతే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. యువత ముఖ్యంగా నేరాల బాట పట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పోలీసులు తెలిపారు. రౌడీషీటర్లు, నేర చరిత్ర కలిగిన వ్యక్తుల కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించేందుకు కఠిన చట్ట అమలు కొనసాగుతోందన్నారు. బైండ్ ఓవర్ నిబంధనలను ఉల్లంఘించే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని తిరుపతి జిల్లా పోలీసులు మరోసారి హెచ్చరించారు. చట్టాన్ని గౌరవిస్తూ సత్ప్రవర్తనతో జీవించే వారికి పూర్తి సహకారం అందిస్తామని, అయితే నేరాలకు పాల్పడే వారిపై మాత్రం కఠిన చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# ప్రజల్లో ఉండాలని పార్టీ శ్రేణులకు పిలుపు: మంత్రి అనిత

- నాయకత్వ స్ఫూర్తితో ముందుకు సాగాలి
- కేడర్‌తో సమన్వయమే విజయ రహస్యం
- ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



**అమరావతి, సెప్టెంబర్ 7 రాజధాని వాయిస్ ::** తెలుగుదేశం పార్టీ నిర్వహించిన లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో ముఖ్యమంత్రి, పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు అందించిన నాయకత్వ స్ఫూర్తిని ప్రతి నాయకుడు ఆచరణలో పెట్టాలని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. ప్రజల్లో ఉంటూ వారి సమస్యలను తెలుసుకోవడం, వాటి పరిష్కారానికి కృషి చేయడం ద్వారానే నాయకత్వానికి విలువ పెరుగుతుందని ఆమె అన్నారు. పార్టీ బలోపేతంతో పాటు ప్రజల విశ్వాసాన్ని మరింతగా సంపాదించుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు. మారుతున్న సామాజిక, రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా నాయకులు తమ పనితీరును మార్చుకోవాలని అనిత సూచించారు. ప్రజలతో నిరంతర సంబంధాలు కొనసాగిస్తూ వారి అవసరాలు, సమస్యలను అర్థం చేసుకుని స్పందించే నాయకత్వం అవసరమని తెలిపారు. ప్రజల మధ్య ఉంటేనే నాయకుడికి నిజమైన బలం లభిస్తుందని ఆమె పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు కేడర్‌తో సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాయకత్వం అంటే కేవలం పదవులు కాదు, ప్రజల నమ్మకాన్ని గెలుచుకోవడమని అనిత పేర్కొన్నారు. ప్రజల కోసం అంకితభావంతో పనిచేసే వారికే సమాజంలో గౌరవం, గుర్తింపు లభిస్తుందని అన్నారు. ప్రజా సమస్యలపై వెంటనే స్పందిస్తూ పరిష్కార మార్గాలను చూపగలిగితేనే నాయకత్వం బలపడుతుందని వివరించారు.ప్రజలతో అనుబంధాన్ని మరింతగా పెంచుకోవడం ద్వారా విశ్వసనీయ నాయకత్వాన్ని నిర్మించుకోవచ్చని మంత్రి తెలిపారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములై, వారి అభిప్రాయాలను గౌరవిస్తూ ముందుకు సాగాలని సూచించారు. రాజకీయాల్లో దీర్ఘకాలిక విజయానికి ప్రజల మద్దతే ప్రధాన బలమని ఆమె పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చూపిన దిశానిర్దేశాన్ని పార్టీ శ్రేణులంతా అనుసరించాలని వంగలపూడి అనిత పిలుపునిచ్చారు. ప్రజల కోసం నిరంతరం పనిచేస్తూ, కేడర్‌తో సమన్వయాన్ని కొనసాగిస్తూ అభివృద్ధి, సంక్షేమ లక్ష్యాల సాధనకు కృషి చేయాలని కోరారు. ప్రజల్లో ఉంటేనే బలం, ప్రజల కోసం పనిచేస్తేనే నాయకత్వానికి నిజమైన విలువ ఉంటుందని ఆమె స్పష్టం చేశారు.

# ఎయిడ్స్ నియంత్రణలో కాకినాడకు జాతీయ గుర్తింపు

- రాష్ట్రంలో ప్రథమ, దేశంలో ద్వితీయ స్థానం సాధించిన జిల్లా
- ఎయిడ్స్ నియంత్రణ అధికారులకు ప్రతిభా అవార్డులు
- జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అభినందనలు
- నిర్దేశిత లక్ష్యాలను అధిగమించిన అధికారుల కృషికి ప్రశంసలు




**కాకినాడ, సెప్టెంబర్ 7రాజధాని వాయిస్ :** ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమాల అమలులో నిర్దేశిత లక్ష్యాలను అధిగమించి రాష్ట్రంలో ప్రథమ స్థానంతో పాటు దేశవ్యాప్తంగా ద్వితీయ స్థానాన్ని సాధించిన కాకినాడ జిల్లా మరోసారి తన ప్రతిభను చాటుకుంది. ఈ విజయానికి కృషి చేసిన జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ అధికారులను జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ప్రత్యేకంగా అభినందించారు. ప్రజారోగ్య పరిరక్షణలో అధికారులు చూపిన అంకితభావం ఫలితంగానే ఈ ఘనత సాధ్యమైందని పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎయిడ్స్ నియంత్రణ సంస్థకు చెందిన అధికారులకు జిల్లా కలెక్టర్ ప్రతిభా అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, ఆరోగ్య రంగంలో జిల్లాకు మంచి పేరు తీసుకురావడంలో అధికారుల సమిష్టి కృషి కీలక పాత్ర పోషించిందన్నారు. ప్రభుత్వ లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రజల్లో అవగాహన పెంచడంలో వారు విశేషంగా పనిచేశారని కొనియాడారు.ఎయిడ్స్ నియంత్రణకు సంబంధించి నిర్వహించిన పరీక్షలు, అవగాహన కార్యక్రమాలు, ముందస్తు గుర్తింపు చర్యలు, చికిత్స సేవల విస్తరణ వంటి అంశాల్లో కాకినాడ జిల్లా అత్యుత్తమ ఫలితాలు నమోదు చేసిందని అధికారులు తెలిపారు. నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించి రాష్ట్ర స్థాయిలో అగ్రస్థానంలో నిలవడం జిల్లాకు గర్వకారణమని పేర్కొన్నారు. ప్రజల్లో ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన పెంపొందించడం, బాధితులకు అవసరమైన వైద్య సేవలు అందించడం, కొత్త కేసులను తగ్గించే దిశగా చేపట్టిన కార్యక్రమాలు మంచి ఫలితాలను ఇచ్చాయని వివరించారు. గ్రామీణ ప్రాంతాల వరకు సేవలను విస్తరించడం వల్లే ఈ విజయాన్ని సాధించగలిగామని అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ ప్రజారోగ్య రంగంలో ఇలాంటి విజయాలు మరింత బాధ్యతను పెంచుతాయని అన్నారు. సాధించిన ఫలితాలతో సంతృప్తి చెందకుండా భవిష్యత్తులో మరింత మెరుగైన పనితీరు కనబరచాలని అధికారులను ప్రోత్సహించారు. ఆరోగ్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంపై దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎయిడ్స్ నియంత్రణ సంస్థ అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు. రాష్ట్రంలోనే కాక దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఈ విజయం కాకినాడ జిల్లా ఆరోగ్య రంగ అభివృద్ధికి నిదర్శనంగా నిలిచిందని అధికారులు పేర్కొన్నారు.

# చీకటి గోపి మృతిపై పోలీసులపై ఎట్రాసిటీ కేసు నమోదు చేయాలి

**గుంటూరు, సెప్టెంబర్ 7 రాజధాని వాయిస్ ::** చేయని నేరానికి చీకటి గోపీ ని చిత్రహింసలకు గురిచేసిన పోలీసులపై చర్యలు తీసుకుని వారిపై ఎట్రాసిటీ కేసు నమోదు చేయాలని దళిత, ప్రజాసంఘాల నాయకులు ఎస్పీ ని కలిసి ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొరివి వినయ్ కుమార్ మీడియా తో మాట్లాడారు. ఏతప్పూ చేయకపోయినా తాడికొండ పోలీసులు చీకటి గోపీ ని అరెస్టు చేసి దారుణంగా టార్చర్ చేసారని చెప్పారు.తాడికొండ పోలీస్ స్టేషన్ లో సీసీటీవీ ఫుటేజ్ తీస్తే అసలు విషయం బయటపడుతుందని చెప్పారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న గోపిని బలవంతంగా జిజి హెచ్ కి పంపించారని తెలిపారు.తీవ్రంగా గాయపడిన చీకటి గోపీ చికిత్స పొందుతూ జీజీహెచ్ లో మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్యాయంగా చీకటి గోపీని టార్చర్ చేసిన సిఐ పై ఎస్సీఎస్టీ కేసు నమోదు చేసి, సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా చీకటి గోపీ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## బిఎల్ఓలతో మాచర్ల మున్సిపల్ కమిషనర్ సమీక్ష



మాచర్ల.సెప్టెంబర్ 07 రాజధాని వాయిస్ : పురపాలక సంఘ కార్యాలయంలో ప్రత్యేక ఓటరు జాబితా పునర్విమర్శ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై బూత్ లెవల్ అధికారులతో (బీఎల్ఓ) ఏఈఆర్ఓ, మున్సిపల్ కమిషనర్ డి. వేణుబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్ఐఆర్‌లో భాగంగా మొత్తం 9,140 మందికి నోటీసులు జారీ చేయగా, ఇప్పటివరకు 6,010 మంది వివరాలు ధ్రువీకరించుకున్నారని తెలిపారు. మిగిలిన 3,332 మంది వెంటనే సంబంధిత పత్రాలతో తమ పరిధిలోని బీఎల్ఓలను సంప్రదించి వివరాల నమోదు పూర్తి చేసుకోవాలని సూచించారు. గడువులోగా ధ్రువపత్రాలు సమర్పించని వారి పేర్లను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఓటరు జాబితా నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏఈఆర్ఓ రాములు నాయక్, ఏఈ రాఘవేంద్రరావు, టీపీఓ నాగేశ్వరరావు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు



పిడుగురాళ్ళ.సెప్టెంబర్ 07 రాజధాని వాయిస్: గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి పుట్టినరోజు సెప్టెంబరు 9 పురస్కరించుకుని కేక్ కట్ చేసి పల్నాడు జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు గొట్టిముక్కల మట్టారెడ్డి ముందస్తు జన్మదినశుభాకాంక్షలు తెలిపారు.నియోజకవర్గం అధికార ప్రతినిధి చల్లాపిచ్చిరెడ్డి,మాజీ ఎంపీపీ అల్లు పిచ్చిరెడ్డి,పిడుగురాళ్ల మండల కన్వీనర్ చింతా సుబ్బారెడ్డి, జిల్లా ప్రచార విభాగ ఉపాధ్యక్షుడు మిట్టా జంగమయ్య,మాజీ యూత్ జిల్లా ప్రధాన కార్యదర్శి సురాబత్తుల మణి చౌదరి,టౌన్ యూత్ ప్రెసిడెంట్ మందా సుధీర్ వైసీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## బట్టు శ్రీనివాసరావుకు సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ప్రతిభా అవార్డు



రాజుపాలెం.సెప్టెంబర్ 07,రాజధాని వాయిస్: మండల ంలోని ఎస్ ఎఫ్ ఎస్ సి బి ఎస్ సి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో గణిత శాస్త్ర ఉపాధ్యాయుడిగా సేవలందించిన బట్టు శ్రీనివాస రావుకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ప్రతిభ అవార్డు వరించింది. గణిత శాస్త్రంలో సరికొత్త నూతన బోధనా పద్ధతులు, మెలుకులతో విద్యార్థులకు ఉన్నతమైన విద్యను అందించినందుకు గాను గత ఏడాది జరిగిన సీబీఎస్ఈ 10వ తరగతి ఫలితాల్లో గణితంలో మంచి మార్కులు సాధించినందుకు గాను సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్ అండ్ టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వ ర్యంలో ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు కార్యనిర్వాహకులు పి నాగయ్య తెలిపారు. గుంటూరులోని భారతీయ విద్యా భవన్ లో రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ, మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణ్ చేతుల మీదుగా బట్టు శ్రీనివాసరావు ఈ అవార్డును అందుకున్నారు.ఈ సందర్భంగా ఎస్ ఎఫ్ ఎస్ పాఠశాల ప్రిన్సిపల్ ఫాదర్ ఇన్నా రెడ్డి, ఫాదర్ అనిల్‌తో పాటు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు ఎస్.కె. బాల సైదా, జ్యోతి రాజ్యలక్ష్మి, ఎన్.శిరీష, బి.ప్రసాద్, ఎస్.కే సిలార్, దత్తు నాయక్ తదిరులు బట్టును అభినందించారు.

## హెచ్ఐవి అవగాహనకు ఎల్ ఈడీ ప్రచార వాహనం ప్రారంభం



చిలకలూరిపేట.సెప్టెంబర్ 07 రాజధాని వాయిస్ :ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ ని యంత్రణ సంస్థ ఆదేశాల మేరకు 'ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపెయి న్ 2026'లో భాగంగా జిల్లాలో హెచ్ఐవి,ఎయిడ్స్ పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేం దుకు ప్రత్యేకంగా సిద్ధం చేసిన ఎల్ఈడి ప్రచార వాహనాన్ని ఏరియా హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అమృత వల్లి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ ఎల్ఈడీ వాహనం చిలకలూరిపేట, నాదెండ్ల, యడ్లపాడు మండలలో 3 రోజులు పాటు ప్రధాన గ్రామాలు, రద్దీగా ఉండే ప్రాంతాల్లో తిరుగుతూ ప్రజలకు హెచ్ఐవి నివారణ, నియంత్రణలపై పూర్తిస్థాయిలో చైతన్యం తీసుకువస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ హెచ్ఐవిపై సరైన అవగాహన కలిగి ఉండాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో హెచ్ఐవి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. హెచ్ఐవి బారిన పడిన వారు నిరాశ చెందకుండా, ప్రభు త్వం ఉచితంగా అందించే ఏఆర్టీ మందులను క్రమం తప్పకుండా వాడి ఆరోగ్యంగా జీవించాలని సూ చించారు.ఈ కార్యక్రమంలో ఏరియా హాస్పిటల్ ఐసీటీసీ కౌన్సిలర్ కె హనుమంత్ రావు, ల్యాబ్ టెక్నీషియన్ వంశీ మరియు క్యాంపు సంస్థ మేనేజర్ కె. పవన్ కళ్యాణ్ మరియు ఏఎన్ఎం ఊహ, శివ క్యాంపు సిబ్బంది, ఏఆర్ టి సిబ్బంది పాల్గొన్నారు.

# ఆత్మానందాన్ని కలిగించే లలిత బాల కథలు




## సాహిత్యం ప్రత్యేకం

రాజధాని వాయిస్

తెలుగు సాహిత్య చరిత్రలో బాల సాహిత్యానికి విశిష్ట స్థానం ఉంది. "నేటి బాలలే రేపటి పౌరులు" అనే నానుడి ప్రకారం పిల్లలలో ఉత్తమ విలువలు పెంపొందించడానికి, వారి మనోవికాసానికి మరియు ఉన్నతమైన సమాజాన్ని నిర్మించడానికి బాల సాహిత్యం యొక్క ఆవశ్యకత ఎంతైనా ఉంది. విజ్ఞాన, నీతి మరియు విలువలను పెంపొందించడానికి, సృజనాత్మకతను పిల్లలకు నింపడానికి, వారి జీవితానికి బలమైన పునాదులు వేయడానికి కథలు, గేయాలు, పద్యాలు మరియు పాటల రూపంలో, సరళమైన భాషలో వారి ఆలోచన స్థాయికి తగినట్టుగా సాహితీ కారులు బాల సాహిత్యాన్ని సృష్టిస్తున్నారు.

### బాల సాహిత్యం- ఆవశ్యకత

"మొక్కై వంగనిది మానై వంగునా" అన్నట్టు బాల్యం నుండే క్రమశిక్షణ కలిగి ఉన్నప్పుడే వారు సఫలీకృతులు అవుతారని, అలాంటి క్రమశిక్షణాయతమైన జీవితాన్ని గడుపుటకు బాల సాహిత్యం ఆవశ్యకత ఎంతైనా ఉంది. భాష పై పట్టు సాధించడానికి, నైతిక విలువలు, వ్యక్తిత్వ వికాసానికి, మన సంస్కృతి, సాంప్రదాయాలు మరియు వారసత్వశీ గురించి తెలుసుకోవడానికి, మానసిక వికాసానికి బాల సాహిత్యం తోడ్పడుతుంది.

### ప్రముఖ బాల సాహితీకారులు

తెలుగు సాహిత్యంలో చిన్నయ సూరి, కందుకూరి వీరేశలింగం, చింతా దీక్షితులు, మరియు గిడుగు సీతాపతి, కరుణ శ్రీ, ముళ్ళపూడి వెంకటరమణ వంటి ఎందరో మహానుభావులు బాల సాహిత్య వికాసానికి ఎంతో కృషి చేశారు. ఉపాధ్యాయ, అధ్యాపక, ఆచార్యులుగా పనిచేస్తున్న వారు విద్యార్థులకు పాఠాలు మాత్రమే కాకుండా జీవిత పాఠాలను పాటలు, పద్యాలు, గేయాలు మరియు కథల రూపంలో అందించారు.

### కథా సాహిత్యం

బాల సాహిత్యంలో కథా సాహిత్యం ప్రముఖ పాత్రను పోషిస్తుంది. అనాది నుండి ఆధునిక కాలం వరకు నీతిని, విజ్ఞానాన్ని, వినోదాన్ని పంచుతూ తెలుగు బాల సాహిత్యంలో కథా సాహిత్యం కీలక పాత్ర పోషిస్తుంది. పంచతంత్ర కథలు, హితోపదేశ కథలు, ఈసఫ్ కథలు తరతరాలుగా పిల్లలకు మంచి నడవడికను, లోకజ్ఞానాన్ని ప్రబోధిస్తున్నాయి. తెనాలి రామకృష్ణుని కథలు, పరమానందయ్య శిష్యుల కథలు, అక్బర్ బీర్బల్ కథలు, మర్యాద రామన్న కథలు పిల్లల్లో ఆలోచనా శక్తిని, సమయస్ఫూర్తిని, హాస్యాన్ని పెంపొందిస్తుంటాయి. కాశీ మజిలీ కథలు, భట్టి విక్రమార్కుని కథలు, కథలు పిల్లల్లో ధైర్యాన్ని, ఊహాశక్తిని నింపుతాయి. చందమామ, బాలమిత్ర, బొమ్మరిల్లు వంటి కథలు ఆధునిక కాలానికి తగినట్టుగా మరియు మానవీయ విలువలను బోధించేవిగా రచించబడ్డాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా బాల కథా సాహిత్యంలో అనేక మార్పులు వచ్చాయి. విభిన్న వృత్తాంతాలను కథా వస్తువులుగా మలచి కథా సాహిత్యాన్ని అందిస్తున్న వారిలో డాక్టర్ మైలవరపు లలిత కుమారి ముఖ్యులు. బండ్లమూడి హనుమాయమ్మ హిందూ మహిళ డిగ్రీ కళాశాల నందు తెలుగు అధ్యాపకురాలుగా పని చేసి ఉద్యోగ విరమణ చేసిన వీరు అనేక రేడియో ప్రసంగాలు, టెలివిజన్ కార్యక్రమాలు, ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. రాష్ట్ర, జాతీయ సదస్సులలో 50 పత్ర సమర్పణలు చేశారు. కళాశాలలో జాతీయ సదస్సులు నిర్వహించారు. కవితలు, వ్యాసాలు, చిన్న కథలు మరియు బాల సాహిత్యాన్ని రచించారు. 26 కథలను లలిత బాల కథలు అను పేరుతో కథా సంపుటిని ప్రచురించారు. ఈ సంపుటంలోని కథలు 2021 నుండి 2026 వరకు ఆకాశవాణి విజయవాడ కేంద్రంగా ఆలోచనాలోచనశీ అను కార్యక్రమం ద్వారా ప్రసారం చేయబడింది. బాల సాహిత్యానికి విశేషమైన కృషి చేసిన డాక్టర్ రావి రంగారావు స్థాపించిన అమరావతి సాహితీ మిత్రులు అను సంస్థ దశమ వార్షికోత్సవం సందర్భంగా ఆవిష్కరించిన ఈ కథల సంపుటి చదువుల తల్లి వాగ్దేవికి అంకితం ఇచ్చారు.

అహంకారంతో గురువుని విస్మరించి ఎంతటి పుణ్య కార్యాలు చేసినప్పటికీ పతనం తప్పదని, పశ్చాత్తాపానికి మించిన ప్రాయశ్చిత్తం మరొకటి లేదని పురాణాలలోని దేవేంద్రుడు మరియు బృహస్పతుల వృత్తాంతాన్ని గురువు దీవెన గా మలచి నీతిని, నైతిక విలువలను బోధించారు రచయిత్రి. మహాభారతంలోని సక్తుప్రస్తుని వృత్తాంతాన్ని తీసుకొని అన్ని దానాలలో కెల్లా అన్నదానమే గొప్పదని, అంతేగాక మనం చేసేటువంటి దానం ఆత్మశుద్ధితో చేయాలని అన్నదాన మహిమ కథలో తెలియపరిచారు. ఎదుటివారు శత్రువైనా ప్రమాదంలో ఉన్నట్లు తెలిస్తే తప్పకుండా సహాయం చేయాలి అనే ధర్మాన్ని మహాభారతం నుండి సంగ్రహించి అపకారికైనా ఉపకారం చెయ్యాలి అను కథలో చక్కగా వివరించారు రచయిత్రి. పురాణాలలోని నహుశుడి అహంకారపు బుద్ధిని, పర్యవసానాన్ని మరియు అతనికి కలిగిన శాప విముక్తిని ఉదాహరణగా అహంకారం పతనానికి హేతువు కథలో వివరిస్తూ ఎట్టి పరిస్థితుల్లోనైనా పెద్దలను మరియు గురువులను అవమానించరాదని హితవు పలికారు. తల్లిదండ్రులకు సేవ చేయుట కంటే మించిన మరొక ధర్మం లేదని ధర్మ వ్యాధుని ద్వారా కౌశికునికి హితబోధను ధర్మ వర్తన అను కథలో ప్రబోధించారు రచయిత్రి. ప్రేమ దయ ఉన్నవాళ్లకి ఎప్పుడు గౌరవం దక్కుతుందని గౌతమునిలో దయా గుణాన్ని, దేవదత్తునిలో చెడ్డ స్వభావాన్ని హంస తీర్పు అను కథలో ఆవిష్కరించారు. రాయలసీమ జానపద సాహిత్యంలో ప్రసిద్ధి చెందిన బలిరాముడు, ఇలవతంసుని వృత్తాంతాన్ని చక్కగా వివరించారు. పిల్లలను ర్యాంకులు సంపాదించే యంత్రాల్లా కాకుండా వారికి స్వేచ్ఛని ఇవ్వాలని, వారి అభిరుచికి తగిన విద్యను చెప్పించాలని బామ్మ మాట కథలో విద్యార్థులకు మరియు తల్లిదండ్రులకు కర్తవ్య బోధ చేశారు. నీతి మరియు నిస్వార్థాల ఆవశ్యకతలను మరియు ఆస్తి అంతస్తులు తో కాకుండా వ్యక్తుల ప్రవర్తనను బట్టి విలువ ఉంటుందని విలువ కథలో ఉద్బోధించారు రచయిత్రి. ప్రమాదం చెప్పి రాదని, ముందుగానే పరిస్థితులను ఊహించి జాగ్రత్త పడాలని ముందుచూపు అను కథలో వివరించారు. మనం చేసే మంచి పనులు మరియు ఇతరులకు సహాయం చేయడంలోనే సంతృప్తి మరియు సంతోషం ఉంది అని ఆనందం అంటే? అను కథలో ఆనందాన్ని నిర్వచించారు. స్వేచ్ఛగా తిరిగే పక్షులను, మూగజీవులను బలవంతంగా బంధించరాదని దానివలన ఇబ్బందులు పడతామని స్వేచ్ఛ అనే కథలో చక్కని సామ్యంతో హితబోధ చేశారు రచయిత్రి. సమయస్ఫూర్తితో వ్యవహరిస్తే ఎటువంటి ప్రమాదం నుండైనా తప్పించుకోవచ్చునని జిత్తులమారి నక్క, తెలివైన తాబేలులను సృష్టించి సమయస్ఫూర్తి అను కథలో అక్షరీకరించారు రచయిత్రి. తన తల్లికి ఇచ్చిన మాట కోసం దొంగల నాయకుడితో నిజాన్ని పలికి అతనిలో పరివర్తన తెచ్చిన విధానాన్ని సత్యమునే పలుకుము అను కథలో కళ్ళకు కట్టినట్లుగా కథ చెప్పారు రచయిత్రి. మనిషి చనిపోయిన తర్వాత శరీరం కుళ్లిపోతుందని లేదా కాల్చితే బూడిదవుతుందని అలా కాకుండా అవయవ దానం చేస్తే ఇతరులకు ప్రాణం పోసినట్లు అవుతుందని పరోపకారమే జీవితం అను కథలో అవయవ దానం ఆవశ్యకతను చిన్నపిల్లలకు అర్థమయ్యే విధంగా తెలియజేశారు.

కలలు కనండి సాకారం చేసుకోండి అని పలికిన ఆదర్శ రాష్ట్రపతి అబ్దుల్ కలాం గారి జీవితాన్ని గురించి తెలియజేస్తూ కష్టపడితే ఫలితం లభిస్తుందని విజయం నీదే అనే కథలో స్పష్టంగా పలికారు రచయిత్రి. గట్టి నమ్మకంతో కార్యాన్ని ప్రారంభించి పనిచేస్తే ఫలితం దక్కుతుందని దృఢ సంకల్పం అను కథలో తెలియజేశారు. మన సంప్రదాయాలు, సంస్కృతిలను ప్రతిబింబించే పండుగలను గురించి పెద్ద పండుగ సంక్రాంతి అను కథలో సంక్రాంతి పండుగ విశిష్టతను వివరించారు. దేశ నాయకులు గురించి పిల్లలకు తెలిపితే దేశభక్తి పెరుగుతుందని అంత మాత్రమే కాదు పిల్లలకు అర్థమయ్యే రీతిలో స్వాతంత్ర్య దినోత్సవానికి, గణతంత్ర దినోత్సవానికి తేడాను దేశభక్తి అను కథలో చక్కగా వివరించారు రచయిత్రి. ఆపదలో ఉన్నవారికి సహాయం చేయవలసిన ఆవశ్యకతను మంచి మనసు అను కథలో వివరించారు. పాత రోజుల్లో వాడే బోషాణానికి, ఇనప పెట్టకి తేడాను మరియు ఉపయోగాన్ని తెలుపుతూనే ఉమ్మడి కుటుంబ ఆవశ్యకతను బోషాణం అను కథలో చక్కగా వివరించారు. నాటి నేటి మానవ సంబంధాలను జనారణ్యం అను కథలో ప్రస్ఫుటపరిచారు. అల్పబుద్ధి కలిగిన వారు అవమానించినా మంచివారు సత్ప్రవర్తనతో వారికి సహాయం చేస్తారని హంసకాకోపాఖ్యానం కథలో తెలియపరిచారు. ఇప్పటి పిల్లల ఆటల అభిరుచికి తగ్గట్టు ఏకాగ్రత అంటే ఏమిటో క్రికెట్ ద్వారా వివరించారు. ఆపద కలిగినా, ఆకలి అయ్యినా కాకులు కలిసి పంచుకుంటాయని ఐకమత్యం కథలో తెలిపారు. తృప్తికి మించిన సంపద మరొకటి లేదని ఆత్మానందం అను కథలో ఉద్బోధించారు రచయిత్రి.

### ముగింపు

పురాణ ఇతిహాసాలలోని ఇతివృత్తాలను, చినయసూరి నీతి చంద్రికను పోలిన పశుపక్ష్యాదులను పాత్రలుగా చేసి, సామాజిక అంశాలను కథలుగా మలచి లలిత బాల కథలుగా నీతిని, మన సంస్కృతి, సాంప్రదాయాలను, విలువలను కథల రూపంలో అందించిన పూర్వ అధికార భాషా సభ్యురాలు మరియు విశ్రాంత తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ మైలవరపు లలిత కుమారి కలం నుండి మరింత బాల సాహిత్యము మరియు విభిన్న రచనలు వెలువడాలని, ఈ పుస్తకము బాల సాహితీ ప్రియులకు మరియు విద్యార్థులకు మరింత చేరువ కావాలని కోరుకుంటూ......

**అనిల్ కుమార్ దారివేముల మాచర్ల,**
**పల్నాడు జిల్లా 9951244718.**

## అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు కలెక్టర్ కృతికా శుక్లా



నరసరావుపేట. సెప్టెంబర్ 07 రాజధాని వాయిస్ :ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చే అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిర్ణీత గడువులోపు నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశిం చారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమ ంలో గురజాల నుంచి 4, సత్తెనపల్లి నుంచి 10, నరసరావుపేట నుంచి 10 రెవెన్యూ క్లినిక్ అర్జీలతో పాటు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన మొత్తం 115 వినతులను అధికారులతో కలిసి ఆమె స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,అర్జీలు మళ్లీ రీ-ఓపెనింగ్ కాకుండా బాధితులు సంతృప్తి చెందేలా పారదర్శ కంగా పరిష్కారం చూపాలని, ముఖ్యంగా వృద్ధులు, దివ్యాంగుల సమస్యలపై మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచిం చారు. సేవల పారదర్శకత కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన సిటిజన్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్‌లను అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో తప్పనిసరిగా ప్రదర్శించి, ప్రజల్లో అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో అద్దయ్య, జీఎస్‌డబ్ల్యూఎస్ నోడల్ అధికారి శివారెడ్డి, డీపీవో నాగేశ్వర్ నాయక్ పాల్గొన్నారు.

## ఉత్తమ క్రీడాభివృద్ధి అధికారిగా అఫ్రోజ్ ఖాన్



గుంటూరు.సెప్టెంబర్ 07రాజధాని వాయిస్ :క్రీడల అభివృద్ధికి విశేష సేవలందించిన గుంటూరు డీఎస్‌డీఓ అఫ్రోజ్ ఖాన్ ఆంధ్రప్రదేశ్ ఉత్తమ క్రీడాభివృద్ధి అధికారి అవార్డు అందుకున్నారు. జిల్లాలో క్రీడాకారులను ప్రోత్సహించడం, నూతన ప్రతిభను వెలికితీయడం, పోటీలను విజయవంతంగా నిర్వహించి నందుకు గాను ఆయనకు ఈ పురస్కారం లభించింది. ఈ సందర్భంగా అఫ్రోజ్ ఖాన్‌ను జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ అభినందిస్తూ, భవిష్యత్తులో జిల్లాకు, రాష్ట్రానికి మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

PRINTED, PUBLISHED AND OWNED BY PAGALA PURNA CHANDRA RAO. MUTUKURU (POST) DURGI MANDAL MACHERLA CONSTITUENCY. PALNADU DISTRICT.AP.DOOR N0 0-004 PINCODE 522612 PHONE NUMBER 9030343195. PRINTED AT SRI KANAKA BHARGAV OFF-SET PRINTERS. MAIN ROAD ANJANEYA COLONY REDDYPALEM GUNTUR 522009 ANDHRA PRADESH . EDITOR :PAGALA PURNA CHANDRA RAO
RNI NO :APTEL/2023/90201PHONE NUMBER : 9030343195.EMAIL. rajadhanivoicedaily@gmail.com